# ఆలోచనాసరళి

సీతమ్మధార వెళ్లెందుకు జగదాంబ బస్‌స్టాప్‌లోకొచ్చి నిలబడ్డాను. సాయంత్రం ఐదవుతోంది.

బస్సులు, ఆటోలు, స్కూటర్లు త్వరత్వరగా తమ గమ్యం చేరుకోవడం కోసం పోటీపడి పరుగెడుతున్నాయి. కాలేజీ కన్నె పిల్లలు రంగు రంగుల దుస్తుల్లో సీతాకోక చిలుకల్లా బస్సుల కోసం కాసుకు కూర్చున్నారు. వారి సోయగాల్ని తిలకిస్తూ పనిగట్టుకుని నిలబడిందక్కడో కుర్రమూక.

"హల్లో దీపక్" అంటూ నా భుజం మీద చేయి వేసిన వ్యక్తి వంక చూసాను అప్రయత్నంగా.

వాడు సుధీర్. నా కాలేజీ క్లాస్ మేట్

ఇరువురం సమవయస్కులమైనా అదృష్టం కలిసొచ్చి నాకు ముందుగానే చిన్న ఉద్యోగం దొరికింది. వాడింకా నిరుద్యోగపర్వంలోనే ఉన్నాడు. నా నివాసానికి దగ్గర్లోనే వాడిల్లు కూడ.

"రూముకేనా?" అడిగాడు సుధీర్.

ఔనన్నట్లు తల ఊపాను.

అంతలో సీతమ్మదార వెళ్లే సిటీ క్రిక్కిర్సిన జనంతో భారంగా వచ్చి ఆగింది. దిగేవాళ్లను దిగనివ్వకుండా స్టాప్‌లోని జనం బస్సుమీదకెగబడ్డారు.

ఎలాగైతేనేం బలప్రయోగం చెసి నేనూ నా మిత్రుడు బస్సులోకి జొరబడ్డాం. ఆ క్షణం ఒలింపిక్ క్రీడల్లో బంగారు పథకం సాధించినంత విజయనగరం మా ముఖాల్లో తొణికిసలాడిందంటే అతిశయోక్తి కాదేమో!

బస్సు కదిలింది. జనాన్ని త్రోసుకుంటూ మా వద్దకొచ్చాడు కండక్టరు.

"సీతమ్మధారకొక టిక్కెట్టు"

టికట్ చింపి నా చేతిలో పెడుతూ ముందుకు సాగిపోయాడు కండక్టరు.

"నువ్వు టిక్కట్టు తీసుకోవా?" అడిగాను సుధీర్ని.

"ఉహూం...నేను తియ్యను" కసిగా పలికాడు సుధీర్.

వాడి మాటలకు ఆశ్చర్యం వేసింది. ఐనా మరి మాట్లాడలేదు.

మా స్టేజి రావడంతో ఇద్దరం బస్సు దిగాం.

"ఔనూ, నువ్వు బస్సులో టికెట్టు ఎందుకు తీయలేదు? డబ్బుల్లేవా?" అడిగాను ఉండబట్టలేక.

"డబ్బులు లేక కాదు. తీయకూడదనే తీయలేదు"

"నీలాంటి చదూకున్నవాడు చేయవలసిన పనేనా ఇది?" గడ్డి పెట్టాను అతడు చేసిన పనికి అయిష్టత వ్యక్తం చేస్తూ.

"దానికి కారణం ఉందిరా. సరిగ్గా వారం రోజుల క్రితం నేను సిటి ఎక్కినప్పుడు రద్దీగా ఉండటం వల్ల కండక్టరు అందుబాటులో లేనందున టి క్కెట్టు తీసుకోలేకపోయాను. అప్పుడే చెకింగు అయింది. టికట్లెస్ ట్రావలెర్ క్రింద నాకు పాతిక రూపాయలు ఫైను వేశారు. సమయానికి జేబులో డబ్బులుండబట్టి సరిపోయింది. లేకుంటే కటకటాలు లెక్కపెట్టవలసివచ్చేది.

"ఒక అనుభవం అయినా ఇంకా బుద్ధిరాలేదన్న మాట" అన్నాను కోపంగా.

"అది కాదు. నా ప్రమేయం లేకుండా జరిగిన పొరపాటుకు పెనాల్టీవేశారు. అందువల్ల ఆ సొమ్ము రికవరీ అయేంతవరకు నేను టిక్కెట్టు తీయదలచుకోలేదు".

"మళ్లీ చెకింగయితే?"

అస్తమాను అవదు కదా. అయిందే అనుకో మరో పాతి ఫైను పడుతుంది అంతే కదా?" అన్నాడు తెలిగ్గా.

చేసిన తప్పు మళ్లీ చేయకుండా ఉండేందుకు ప్రభుత్వం పినాల్టీవేసి శిక్షిస్తుంది. ఐతే కట్టిన డబ్బు ఈ రకంగా తిరిగి రాబట్టుకోవాలనుకుంటున్న ఆ ప్రబుద్ధిడి ఆలోచనాసరళకి అవాక్కై పోయాను.

**(19-8-92 ఆంధ్రభూమి దినపత్రిక)**